క్లుప్తంగా

ఘనంగా పంచామృతాభిషేకాలు



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద సీతారామక్షేత్రంలో కొలువైన శ్రీసీతారామచంద్ర స్వామివారికి శనివారం పంచామృతాభిషేకాలు ఘనంగా జరిగాయి. ఏకాదశి పర్వదినం సందర్భంగా అర్చకులు మరింగంటి వరదాచార్యులు పర్యవేక్షణలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా దాసు

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన ఏపీ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడైన కేవీ నారాయదాస్ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గుంటూరులో రెవెన్యూ ఉద్యోగుల కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని నారాయణదాస్ తెలిపారు. ఉద్యోగుల సమస్యల అధ్యయనానికి, పరిష్కారానికి రాష్ట్ర ఫెడరేషన్‌తో కలిసి కృషి చేస్తానని దాస్ తెలిపారు.

మహిళలకు చీరల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న అశోక్‌కుమార్

మండపేట: మండలంలోని మెర్నిపాడు ఎస్సీ కాలనీలో నిరుపేద మహిళలకు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత గారపాటి అశోక్ కుమార్ శనివారం చీరలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆయన జన్మదిన వేడుకల నేపథ్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు, వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, పాలతోడు, జెడ్.మేడపాడు గ్రామ కమిటీల అధ్యక్షులు పిల్లా అరవరాజు, తోరం శ్రీనివాస్, పంపన బుల్లియ్య, పట్టణ నాయకులు చల్లా మోహన్, ముత్యాల పెద్దబ్బు, గారపాటి రాంబాబు, యరమాటి సత్తిబాబు పాల్గొన్నారు.

సీఎంను కలవనీయకుండా అడ్డుకున్నారు

మండపేట: అమలాపురం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాము కలిసేందుకు ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆరోపించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఆయనను కలిసి వివరించేందుకు ఎంట్రీ అనుమతి ఇప్పించాలని ఉన్నతాధికారులను కోరగా వారు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు కోట శ్రీనివాసరావు, ఖాన్, కొడవళ్ల సుబ్బారావు, కొండ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అంగరలో గద్దర్‌కు నివాళి



అంగర గాంధీ సెంటర్‌లో గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న శ్రామికులు

కపిలేశ్వరపురం: ప్రజా కళాకారుడు గద్దర్‌కు మండలంలోని అంగర గాంధీ సెంటర్‌లో శనివారం ఘనంగా నివాళి అర్పించారు. ఐఎఫ్‌టీయూ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, వి.భీమశంకర్ మాట్లాడుతూ చివరి క్షణం వరకూ ప్రజలతోనే తన పాట రూపంలో మమేకమైన ధన్యజీవి గద్దర్ అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కొంత సమయాన్ని కేటాయించడం ద్వారా గద్దర్‌కు ప్రతి ఒక్కరూ నివాళి అర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కవల గోవింద్, రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు నల్లూరి మురళీకృష్ణ, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

పేదలకు విద్యుత్ బిల్లుల భారం

మండపేట: ప్రభుత్వం ఇష్టానుసారంగా పెంచుకుంటూ పోతున్న విద్యుత్తు బిల్లులు పేదలకు పెనుభారం అవుతున్నాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ టీడీపీ హయాంలో ఒక్కసారి కూడా విద్యుత్తు బిల్లులు పెంచలేదన్నారు. పెంచిన విద్యుత్తు చార్జీలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మీ సేవలు బంగారంగానూ..

- ఆర్బీకేల సేవలు అమోఘం
- టీడీపీ హయాంలో కన్నీళ్ల సాగు
- వైఎస్సార్ సీపీతో సంక్షేమం పరవళ్లు



అద్దంపల్లిలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే భవనం

కె.గంగవరం: వైఎస్సార్ ప్రభుత్వం ద్వారానే రైతు సంక్షేమం పరవళ్లు తొక్కుతుంది. ఒకప్పుడు అన్నదాతకు సాగు కష్టాలు, కన్నీళ్లే, దినదిన గండాలే. టీడీపీ అధినేత చంద్రబాబు సాగును దండగ అనడమే కాకుండా అలా మార్చారు కూడా. అలాంటి సమయంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాగులో సిరులు కురిపించింది. వ్యవసాయ రంగాన్ని కొత్తపుంతలు తొక్కించింది. తద్వారా సాగు బంగారమైంది. ఆర్బీకేల ఏర్పాటుతో పాటు, వైఎస్సార్ యంత్రసాయం, సాగు రుణాలు, రైతు భరోసా వంటి పథకాలు కొండంత ఆసరాగా నిలిచాయి. నేడే రైతు ముంగిటకే వచ్చిన రైతు భరోసా కేంద్రాలతో అన్ని సేవలు సక్రమంగా అందుతున్నాయి. అన్నదాతలకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. సీఎం జగన్ నేను న్నానని పూర్తి భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నాలుగేళ్లుగా రైతు సంక్షేమానికి బాట వేస్తోంది. ఆర్బీకేల ద్వారా సాగుకు అవసరమైన అన్ని సదుపాయాలను రైతు వద్దకే అందిస్తోంది. సాగులో ఎదురయ్యే ఇబ్బందులను వెంటనే పరిష్కరించుకునేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 23, కాజులూరు మండలంలో 24, రామచంద్రపురం మండలంలో 25 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్కో ఆర్బీకేలో వ్యవసాయ సహాయకులను నియమించి రైతులకు అందుబాటులో ప్రభుత్వం ఉంచింది. రైతులు విత్తనాలు వేసినప్పటి నుంచి ధాన్యం కొనుగోలు చేసేంత వరకు వ్యవసాయ సహాయకులు పూర్తి సహకారం అందిస్తున్నారు. అవసరమైన సేవలు కూడా అందిస్తు రైతులను శాస్త్రవేత్తలుగా మారుస్తున్నారు.

ఆ ఇబ్బందులు తప్పాయి



గతంలో రైతులకు ఇబ్బందులు ఎదురైతే మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దకు వెళ్లాల్సి వచ్చేది. లేకపోతే అధికారులు గ్రామాలకు వచ్చేంత వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. సీఎం జగన్ ప్రభుత్వంలో సంబంధిత అధికారులు గ్రామంలోనే అందుబాటులో ఉంటున్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నారు. రైతులకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన ఇబ్బందులు తప్పాయి. – తోకల శ్రీను, రైతు, తామరపల్లి

ఎంతో తోడ్పాటు



రైతులకు సాగులో ఎదురయ్యే పలు సమస్యలు పరిష్కరించేందుకు ఆర్బీకేలు ఎంతో తోడ్పాటు అందిస్తున్నాయి. తమ గ్రామంలోనే ఏర్పాటైన ఆర్బీకేల వద్దకు వెళ్లి అక్కడ సిబ్బందికి సమస్యలు చెప్పుకోవడం ద్వారా సమస్యల పరిష్కారం దొరుకుతోంది. గతంలో పడాల్సిన ఇబ్బందులు ఇప్పుడు లేకుండా పోయాయి. – రాయుడు జగన్, రైతు, నల్లచెరువు పుంత

పంటలకు మద్దతు ధర



గతంలో దళారులు చెప్పిన ధరకు ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చేది. అయితే మద్దతు ధర ప్రకటించడంతో పాటు ఆ ధరతోనే ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో ఇప్పుడు రైతులకు మేలు జరుగుతుంది. కొనుగోలు విషయంలో ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరిస్తున్నారు. దీంతో రైతులకు అదనపు ప్రయోజనం కలుగుతోంది. – బసులు రవి, ఏఓ, కె.గంగవరం

సోమేశ్వరంలో బులి బాపనమ్మ తీర్థం



అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్, సర్పంచ్ ఆరిఫ్

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో బులి బాపనమ్మ తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఏటా అమ్మ వారి జాతర, తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. పిల్లా పాపలు, పాడిపంటలు, పసుపు కుంకాలను చల్లగా చూడాలని కోరుతూ మహిళలు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, సర్పంచ్ ఆరిఫ్, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, సోమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలి



సోమేశ్వరంలో నిర్వహిస్తున్న పొలంబడి

రాయవరం: అధిక దిగుబడులు సాధించేందుకు నిర్వహిస్తున్న పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమేశ్వరంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. మిత్ర, శత్రు పురుగులను ఏ విధంగా గుర్తించాలో ఆయన రైతులకు వివరించారు. పొలంబడిలో భాగంగా గత వారంలో నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులో రైతులు ఎటువంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలో రైతులే నిర్ణయం తీసుకునలా వారిని తయారు చేయడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమన్నారు.అలాగే ఎలుకల నిర్మూలన ఏ విధంగా చేపట్టాలో తెలియజేశారు. వ్యవసాయ శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కె.గంగవరం: గ్రామంలోని ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ అనుసూరి సాయి సూచించారు. మండలంలోని శివల గ్రామంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి వీధిలో ఉన్న చెత్తను క్లీన్ చేసి డ్రైనేజీలను బాగు చేశారు. సర్పంచ్ సాయి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వారం రోజుల పాటు గ్రామంలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదేశాల మేరకు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ నిడదవోలు సుబ్రహ్మణ్యం, గ్రామపెద్దలు పారిశుధ్య కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



చింతలూరులో అలంకార భూషితుడైన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. చింతలూరు, సంధిపూడి, నర్శిపూడి, గుమ్మిలేరు గ్రామాల్లోని ఆలయాలకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి దేవతామూర్తులకు నైవేద్యాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణాలన్నీ గోవింద నామస్మరణతో మార్మోగిపోయాయి. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

పూర్వ విద్యార్థుల కలయిక



సఖినేటిపల్లి లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

సఖినేటిపల్లి: స్థానిక లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల 1986–87 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలలో ఓ వేదికపై కలుసుకున్నారు. ఎక్కడెక్కడో ఉద్యోగాల రీత్యా స్థిరపడిన వారంతా ఒక చోట కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను వారు నెమరువేసుకున్నారు. అలాగే విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. 37 సంవత్సరాల తరువాత కుటుంబ సభ్యులతో ఒకరినొకరు కలుసుకుని సంతోషాన్ని, ఆహ్లాదాన్ని పంచుకున్నారు. పిల్లలతో ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పాఠశాల కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం, రమేష్, సువర్ణరత్నం, కత్తిమండ చిట్టిబాబు, విజయరత్నం, బళ్ళ నోబుల్ ప్రభాకర్, నేతల నిర్మల, నల్లి సునీల్‌రావు, ఏలూరు విజయశేఖర్, గెద్దం రాజేష్ పాల్గొన్నారు.

చిన్నారికి సూపర్ టాలెంటెడ్ కిడ్ అవార్డు



గరిమెళ్ళ లక్ష్మీవర్ణిక (ఫైల్)

రావులపాలెం: పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టుగా రావులపాలేనికి చెందిన గరిమెళ్ల సూర్య శివరామ కార్తీక్, దుర్గాగాయత్రి దంపతుల కుమార్తె లక్ష్మీవర్ణిక 14 నెలల చిన్న వయసులోనే ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సొంతం చేసుకుంది. ఈ పాప 9 నెలల వయసులోనే అన్నీ గుర్తుపట్టడం, వాహనాలు, పండ్లు, జంతువులు, కూరగాయలు, మానవ శరీర భాగాలు, నిత్యావసరాలు, ఇలా అన్నీ గుర్తుపట్టడం గమనించిన తల్లిదండ్రులు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పాప వీడియోలను పంపించామన్నారు. దీనిని పరిశీలించిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వారు పాపను సూపర్ టాలెంటెడ్ కిడ్ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. జూలై నెలలో తాము ఈ అవార్డుకు పంపగా సంస్థ నుంచి తమకు ధ్రువీకరణ పత్రాలు మెయిల్‌లో శనివారం అందాయని వారు తెలిపారు.

అవయవదానానికి దంపతుల నిర్ణయం



సత్యనారాయణ-విశాలక్ష్మి దంపతులు

ఆత్రేయపురం: తాము మరణించిన తర్వాత వారి శరీర అవయవాలను తీసుకుని, వాటి అవసరం ఉన్నవారికి ఉచితంగా అందజేయాలని కోరుతూ దంపతులు రాజమహేంద్రవరం జీఎస్ఎల్ మెడికల్ కాలేజీకి అంగీకార పత్రాన్ని అందజేశారు. ఈనెల 9న జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ ట్రస్టు సంయుక్త నిర్వహణలో శరీర అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మరణానంతరం కూడా తాము జీవించాలని ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన ముళ్లపూడి సత్యనారాయణ-విశాలక్ష్మి దంపతులు భావించారు. అందుకే జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ అధ్యక్షుడు గన్ని భాస్కరరావుకు, సావిత్రీబాయి పూలే ట్రస్టు అధ్యక్షురాలు గూడూరి సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో ఆ దంపతులు తమ అవయవ దానానికి సంబంధించిన అంగీకార పత్రాలను శనివారం అందజేశారు. ప్రతి ఒక్కరూ తమ అవయవాలను మరణానంతరం దానం చేయడం వల్ల ఎంతో మందికి ప్రాణం పోసి.. తద్వారా జీవించగలుగుతామని వారు అన్నారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఆలమూరు: గ్రామంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. జిల్లా విద్యార్థి నాయకులు చేపట్టిన రావులపాలెం నుంచి ఈ బైక్ ర్యాలీలో ఆలమూరు ప్రభుత్వ హాస్టల్ వద్దకు చేరుకున్నారు. జిల్లా కో కన్వీనర్ వెంకట్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రవికుమార్ పాల్గొని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ చేస్తున్న పోరాటాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ రవికుమార్, కో కన్వీనర్ వెంకట్ పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు గ్రామ సచివాలయ నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ భవనాన్ని ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.25 లక్షలతో నిర్మించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామ సచివాలయం ద్వారా గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుండుమోగుల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ రావూరి వెంకటరామారావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటుకుందాం



ఎంపీ బోస్‌కు జాతీయ పతాకాన్ని అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌కుమార్

రామచంద్రపురం: స్వాతంత్య్ర దినోత్సవమైన ఆగస్టు 15న ప్రతి ఒక్కరూ జాతీయ పతాకాన్ని ఎగరవేసి దేశభక్తిని చాటుకుందామని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో రామచంద్రపురం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మణ్‌కుమార్ ఎంపీ బోస్‌కు జాతీయ పతాకాన్ని అందజేశారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా జాతీయ పతాకాలను విక్రయిస్తుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఈనెల 14వ తేదీ వరకు విక్రయిస్తారని తెలిపారు. మెయిల్ ఓవర్‌సీస్ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఈశా' సేవలు అభినందనీయం



గొల్లపాలెంలో ఈశా గ్రామీణ క్రీడలను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

కాజులూరు: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ఈశా ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని ఏపీ వాలీబాల్ అసోసియేషన్ రిఫరీ స్పోర్ట్స్' కన్వీనర్, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు లంకా జార్జ్ అన్నారు. గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ క్రీడా గ్రామోత్సవాల్లో శనివారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు తదితరులు వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. తొలిరోజు వాలీబాల్ పోటీలు నిర్వహించగా కాజులూరు, కరప, తాళ్లరేవు, పెదపూడి మండల గ్రామాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిని అధికారులు 36 టీంలుగా విభజించి పోటీలు నిర్వహించారు. ఫౌండేషన్ కాకినాడ జిల్లా సమన్వయకర్త నరాల సాగర్, సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ కాయల నరసింహమూర్తి, డీఎస్‌డీఓ శ్రీనివాసరావు, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాత నాగరాజు, పీఈటీ సునీల్‌కుమార్, తోట కృష్ణ, వడ్డి శ్రీను, పెంటపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నా భూమి–నా దేశం



గొల్లపాలెంలో 'నా భూమి-నా దేశం' కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు



తాళ్లపాలంలో నా భూమి-నా దేశం శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కాజులూరు: మండలంలోని కోలంక, పల్లిపాలెం, ఒంటితాడి, బందనపూడి, నామవానిపాలెం, గొల్లపాలెం తదితర గ్రామాల్లో శనివారం అధికారులు, నాయకులు 'నా భూమి–నా దేశం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించి జాతీయ జెండా ఎగరవేసి గౌరవ వందనం సమర్పించారు. గొల్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు తదితరులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ గ్రామాల్లో నా భూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించి 75 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. గ్రామ సర్పంచ్‌లు పోతురాజు ప్రసన్నమౌనిక, కోమలి వెంకటరమణ, పార్టీ నాయకులు యాళ్ల సత్తిబాబు, కొఠాని గనేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు సత్తి శ్రీరామారెడ్డి, గండి కిశోర్, పంచాయతీ కార్యదర్శి చొల్లంగి వేణుగోపాలరావు, వీర్వోలు ఈశ్వరరావు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉట్రుమిల్లి, మాలపాడు, తాళ్లపొలం, ఉండూరు, భీమక్రోసుపాలెం, ఏరుపల్లి గ్రామాల్లో శనివారం 'నా భూమి–నా దేశం', నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు అయ్యల అమ్మాజీ, ఘంటా సుజనప్రియాంక, కట్టా గోవిందు, పలివెల లోవరాజు, మల్లిమొగ్గల శ్రీధర్, ఎంపీటీసీలు పంపన ఏడుకొండలు, యన్నం దేవి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి సందేశాలు, ఆజాదీకా అమృత్ మహోత్సవ్ లోగో, స్వాతంత్య్ర సమరయోధుల పేర్లు తదితర వివరాలతో కూడిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. శిలాఫలకాల వద్ద మొక్కలు నాటారు. శిలాఫలకం చుట్టూ దీపాలు వెలిగించారు. అందరూ కలసి ప్రతిజ్ఞలు చేశారు.

అన్ని భాషలకూ సంస్కృతమే మూలం

- తత్త్వవిదానంద సరస్వతి స్వామీజీ
- ఘనంగా సంస్కృత కళాశాల శత జయంత్యుత్సవం



దత్తుడు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సరస్వతి స్వామీజీ తదితరులు

పి.గన్నవరం: సంస్కృత భాష ఎంతో గొప్పదని, అన్ని భాషలకూ అదే మూలమని తత్త్వవిదానంద సరస్వతి స్వామీజీ అన్నారు. నరేంద్రపురంలో శ్రీ సుబ్రహ్మణ్య భారతీ భవన సంస్కృత కళాశాల శత జయంత్యుత్సవాలను త్సల్లా బ్రదర్స్ ఆధ్వర్యాన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, మాజీ ఎంపీపీ త్సల్లా బిందుమాధవరావు అధ్యక్షతన జరిగిన సభలో స్వామీజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతీయ సంస్కృతికి మూలమైన వేదాలను, సంస్కృత భాషను పరిరక్షించేందుకు త్సల్లా సుబ్రహ్మణ్యం (దత్తుడు) 1923లో ఇక్కడ సంస్కృత కళాశాల స్థాపించారని చెప్పారు. ఈ కళాశాలను నిర్వహిస్తున్న ఆయన కుటుంబీకులను అభినందించారు. 1951 నుంచి 1971 వరకూ సర్పంచ్‌గా పని చేసిన దత్తుడు.. గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయడమే కాకుండా, గ్రామాభివృద్ధికి విశేష సేవలు అందించారని చెప్పారు. ఈ సంస్కృత కళాశాలలో గురువు సుబ్బరాయశాస్త్రి వద్ద ఏడేళ్ల పాటు తాను విద్యను అభ్యసిస్తూనే, స్థానిక ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సీ వరకూ చదువుకున్నానని తెలిపారు. ఈ ప్రాంతంతో పాటు, త్సల్లా వారి కుటుంబీకులతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని స్వామీజీ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా దత్తుడు జీవిత చరిత్ర పుస్తకాన్ని తత్త్వవిదానంద ఆవిష్కరించారు. తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం ఉప కులపతి జీఎస్ రామకృష్ణమూర్తి, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, దోర్బల ప్రభాకరశర్మ, కొంపెల్ల సత్యనారాయణశాస్త్రి, గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి, పుస్తక రచయిత మిర్తిపాటి శ్రీరామచయనులు తదితరులు ప్రసంగించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సంస్కృత కళాశాల వ్యవస్థాపకుడు దత్తుడు విగ్రహాలకు స్వామీజీ పూలమాలలు వేశారు. కళాశాలలో మధ్యాహ్నం వేదస్వస్తి, సాయంత్రం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ త్సల్లా దొరబాబు, త్సల్లా కృష్ణారావు, శ్రీనివాస్, డొక్కా నాథ్‌బాబు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు, గ్రామస్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న మ్యాజిక్ ఫ్యామిలీ

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలిలో స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద శ్యామ్ జాదూగర్ మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జాతీయ జెండా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఉమాకమండలేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను బహూకరించి ఉచిత అల్పాహారాన్ని మ్యాజిక్ ఫ్యామిలీ ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో ప్రముఖ ఇంద్రజాలికుడు చింతా శ్యామ్‌కుమార్, సంస్థ నిర్వాహకులు అన్నపూర్ణ, మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి రూ.50 వేల విరాళం

ఆలమూరు: స్థానిక భువనేశ్వరి చెరువు గట్టు సమీపాన నిర్మిస్తున్న కాపు కల్యాణ మండపం నిర్మాణానికి గ్రామ ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి సోదరుడు మల్లిపూడి వెంకటరాజు దంపతులు రూ.50 వేలు విరాళాన్ని ప్రకటించారు. ఉద్యోగ రీత్యా మలేషియాలో స్థిరపడిన ఆ దంపతులు ప్రకటించిన విరాళాన్ని ఉప సర్పంచ్ చేతుల మీదుగా శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా నానాజీ, రామానుజుల శేషగిరిరావు, శిరిగినీడి పట్టాభి, శ్రీపతి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.